# బాపూజీ

మహాత్మాగాంధి పుట్టిన రోజయిన అక్టోబర్ 2 ను ఐక్యరాజ్యసమితివారు
ప్రపంచ అహింసా (శాంతి) దినంగా పరిగణించిన సందర్భంగా వ్రాసిన గేయం.

డా॥ కోలగొట్ల సూర్యప్రకాశరావు

1. భారత జాతిపిత బాపూజీ
పారతంత్ర్యము తొలగించినాడు
మారణ సాధనములు వాడకనె
ఘోర సమరంబు సాగించినాడు

2. కులమత ప్రాంతీయ భావముల
నిల నైక్యతకు మేలు కాదనెను
పాలకుల మతవిభజన బీజము
మూలనాశము చేయవలె ననెను

3. తినుటకు తిండియు కట్టుటకు బట్టయు
మనుటకు పంచయు మంచికి విద్యయు
తనువులకు వైద్య సహాయములును
అనుగు రాచబాటని పలిపలి చెప్పినాడు

4. గ్రామంబు దేశ మూల మన్నాడు
సీమ వస్తువుల నిరసించినాడు
నీమముగ నుద్యమమున నురికినాడు
క్రమముగ జనుల నందుంచినాడు

5. నోట వేరుశనగ భుజించినాడు
పూటకు మేకపాలు త్రాగినాడు
రాటము దిప్పి నూలు వడికినాడు
వాటముగ కుళ్లాయి గట్టినాడు

6. అహరహముగ పాటు పడినవాడు
ఇహము పరము ధ్యాస నుంచినాడు
అహము వీడి సేవ చేసినాడు
గృహ పరిశ్రమలను ప్రోత్సహించె

7. అంటరాని తన మడుగంట జేసె
కంటకపు కుతత్వ మేల ననెను
ఇంట శాకముల పండించ మనెను
పెంట సారము పంటకు పెట్ట మనెను

8. మద్యపానము మనిషికి చెడ్డ యనెను
ఉద్యమించి యుప్ప పన్ను నిరసించె
గద్యమున గీతాసారము నుడివినాడు
విద్యలన్నిటి స్త్రీలకును నేర్వమనెను

9. గృహిణుల మణులంచు నుడివినాడు
మహిళల మహోద్యమ మూల మనెను
బహిరంగముగ మహితల నేత జేసె
నహి యను నాథుల వారించి నాడు

10. మర్మాలు జనతకు చేటంచు జెప్పె
ధర్మాలు మతములకు మూల మనెను
కర్మాచరణ చేసి చూపించి నాడు
నిర్మాణ కార్యక్రమమును తీర్చిదిద్దె

11. సత్యాహింసలు సమత సద్ధర్మము
నిత్యానందముతో పాటించినాడు
అత్యాశలు గల వలస పాలకులను
సత్యాగ్రహముతో నెదరించినాడు

12. మతము నందభిమతము చూపినాడు
హితమాడి మనసులను దోచినాడు
వ్రతముగ నిరాహార ధీరుడై నిలచి
వెతల భరియించి చెరసాల చేరినాడు

13. భాను డస్తమించని రాజ్యమునకు
కనుచీకటిని ప్రసాదించినాడు
వినువీధిలో భారత బావుటాను
మను విధానమును చూపించినాడు

14. మత సామరూస్యత మంచి దన్నాడు
వెత నొందు నవకాళి కేగుదెంచె
హతమార్చ మూఢుల వేడినాడు
పతనపథము వీడ బ్రతిమిలాడే

15. హిందు ముస్లిము కలహ మరసినాడు
పొందుగూర్చు దీక్ష నొందినాడు
అందు మధ్యవర్తిగ నిలచినాడు
బందుకు గుండ్లు బందుచేసె నతని

డా॥ సూర్యప్రకాశరావు గారు వృత్తిరీత్యా వెటరినరీ డాక్టరు. వారు 1970వ సంవత్సరములో న్యూయార్క్‌లోని ఫ్లషింగ్‌కి వచ్చారు. అక్కడ ఉండగా " తెలుగు సారస్వత సాంస్కృతిక సంఘం " వారి " తెలుగు వెలుగు " పత్రికకు ఎడిటర్‌గా పని చేశారు కూడా. 1998లో మేసచ్యుసెట్స్‌లోని కేంబ్రిడ్జ్‌కి వచ్చి అప్పటి నుండి అక్కడే ఉంటున్నారు. సాహిత్యపరంగా 30కి పైె చిలుకు రచనలు చేశారు. ప్రస్తుతము " ఆటవెలదిలో ఆణిముత్యాలు " అనే శతకం వ్రాస్తున్నారు.

# ఒక నాన్న కథ

## 2007 అమెరికా భారతి కథల పోటీలో మొదటి బహుమతి పొందిన కథ

డా॥ మాచిరాజు వెంకటరత్నం

ఆకాశం అంతా చీకటి తో నిండిపోయినా. నేలమీద మటుకు రాలిన నక్షత్రాల్లా దీపాలు మిలమిలా మెరుస్తున్నాయి ప్రతి ఇంట్లో.

ఆ రోజు దీపావళి. ప్రతియింట్లో ఎంతో హడావుడిగా, చాలా సంబరంగా మనుషులు తిరుగుతూ పోతూ చాలా ఆనందదాయకంగా వుంది. పిల్లలు కాకరపువ్వత్తులూ, రకరకాల టపాకాయల్ని పట్టుకొని పరుగెత్తుతున్నారు. పెద్దవాళ్ళు " జాగ్రత్తరోయ్ ! " అంటూ పిల్లల వైపు పెద్దపెద్దగా అరుస్తూ మరలా వాళ్ళ పనులు వాళ్ళు చూసుకుంటున్నారు. ఇంట్లో వుండే మహాలక్ష్ములందరూ కొత్త పట్టుచీరలు కట్టుకొని వాకిట్లో వున్న పిల్లల్ని, యింట్లో వున్న భర్తల్నీ చూస్తూ ప్రక్క యిళ్లల్లో వున్న ఆడ వాళ్ళతో ఆ మాటలూ, ఈ మాటలూ మాట్లాడుతున్నారు.

ఇంత సంబరం ఆ వీధిలో దేదీప్యమానంగా వున్నా ఆ యిళ్ళ మధ్యలో ఉన్న ఒక చిన్నయింట్లో రోడ్డు మీద మునిసిపాలిటీ వాళ్ళ ఎలక్ట్రిక్ స్తంభం లైటునుంచి వచ్చే వెలుతురు తప్ప మరేదీపాలు వెలగటం లేదు.

నెమ్మదిగా తలుపులు తీసుకొని రామయ్య బయటకొచ్చాడు ఆ యింట్లోంచి. నాలుగు యిళ్ళు దాటితే ఒక చిన్న బంకు వున్నది. రోజూ అక్కడి దాకా నడచి వెళ్ళి, బంకు దగ్గర వున్న బల్ల మీద కూర్చొని ఒక చుట్ట త్రాగటం అలవాటు. ఈ రోజు కూడా అలాగే నడచి వెళ్ళాడు. ఆ బంకులో కూర్చున్న సుబ్బయ్యకు రోజూ రామయ్యను చూడటం అలవాటే. రెండు మూడు గంటలు అలగే కూర్చుని కాలక్షేపం చేయటం, ప్రపంచ రాజకీయాల దగ్గర నుంచి యింట్లో విషయాల వరకు అన్నీ మాట్లాడుకోవటం అలవాటు.

" సుబ్బయ్య ! ఒక చుట్ట యివ్వు " అంటూ యాభైరూపాయల నోటుని బయటకు తీసాడు రామయ్య.

" ఈ రోజు పండగ కదా ! దగ్గర పెద్దనోట్లు తప్ప చిల్లర లేదు. " అన్నాడు సుబ్బయ్య.

" నీ దగ్గర డబ్బులు ఎక్కడికి పోతాయిలే ! ఈ రోజు కాక పోతే రేపు యివ్వు లేకుంటే ఈ సారి చుట్టలు కొన్నప్పుడా డబ్బులు సరిపెట్టుకో !" అంటూ చుట్టకోసం చేయి చాచాడు రామయ్య.

" అది సరే ! అయినా నీ డబ్బులు నాదగ్గరెందుకు? ఈ రోజు దేశం మొత్తానికి ఒక పెద్ద లాటరీ వుంది. మొదటి బహుమతి కోటి రూపాయలు. ఒక టిక్కెట్టు ఇరవై రుపాయలు. టిక్కెట్టు కొంటే సరిపోతుందిగా !" అన్నాడు సుబ్బయ్య.

" దొంగ వెధవకి డబ్బులు కాజేయాలని వుంది " - అని మనసులో అనుకుంటూ, " నా కెందుకు లాటరీ! ఎనభై ఏళ్ల పైన వయసు దాటిన నాకు ఈ లాటరీ తగిల్తేనేం, తగలకపోతేనేం ! అన్ని డబ్బులు ఏం చేసుకుంటాం ? " అంటూ చుట్ట వెలిగించాడు రామయ్య.

" అదేంటి స్వామి ! అట్లా అంటావు. నీకు పిల్లలూ, మనవళ్ళు వున్నారుగా, వాళ్లకు యివ్వచ్చుగా " అన్నాడు సుబ్బయ్య, రామయ్య ను ప్రేరేపిస్తూ.

" పిల్లలకు మన డబ్బులు అవసరం లేదోయ్ ! పైగా వాళ్ళు ప్రతి నెలా నాకు పంపిస్తున్నందువల్లే కదా నేను యిక్కడ జీవించటం. మనవళ్లంటావా ? వాళ్లకు మన గురించి అసలు తెలియనే తెలియదు. " రామయ్య మనసులోని బాధను బయటకు తెచ్చాడు.

" అదేంటి రామయ్య ! నీ ముగ్గురు పిల్లలు అమెరికాలో వున్నారని నీవు గర్వపడుతున్నావని మేం అనుకుంటుంటే నీవు నీరసంగా వున్నావు" సుబ్బయ్య యింకా లాటరీ టిక్కెట్టు అమ్మే ప్రయత్నం లోనే వున్నాడు.

" అవును నిజమే ! ముగ్గురు పిల్లలూ అమెరికాలోనే వున్నారు. కానీ నిజం వున్నది చూశావా ? ఈ వయస్సులో నాదగ్గర ఎవ్వరూ లేరు. కనీసం నాభార్య కూడా లేదు. అదేనయ్యా జీవితమంటే ! మనకున్న వాటిని గురించి మిగతా ప్రజలు ఈర్ష పడుతుంటే, మనకి లేని వాటిని గురించి ఆలోచించి మన మనస్సు మధన పడుతుంది. ఇరవై ఏళ్ల క్రిందట నా పిల్లలు అమెరికాలో వున్నారంటే నాకు ఎంతో గర్వంగా ఉండేది. కాని, వాళ్ళు ఆ దేశాలలోనే పాతుకుపోతారని, ఈ వయస్సులో యిలా ఒంటరి జీవితాన్ని జీవించాల్సి వస్తుందని కలలో కూడా ఊహించలేదు. " అంటుంటే అమావాస్య నాటి చీకటి అంతా తన ముఖాన్ని కప్పివేసినట్లు రామయ్య ముఖం వ్యక్తమయింది.

" మరి నువ్వూ అమెరికా వెళ్లి వాళ్ల దగ్గరుండొచ్చు కదా ?" అన్నాడు సుబ్బయ్య రామయ్యను చూస్తూ .

" నిజమే ! కానీ బురద నీళ్లల్లో వున్నా చేప జీవించగలదు, కానీ బంగారు పళ్లెంలో పెడితే అది బతుక గలదా ? అదేనోయ్, మన జీవితం గురించిన సత్యం కూడా ! యిక్కడ జీవితానికి అలవాటు పడ్డ కొంతమందికి అక్కడ సర్దుకుపోవటం వీలుపడదు. అలాంటి వాళ్లలో నేనూ ఒకణ్ణి. పిల్లలు, మనవళ్ళు వాళ్ల పనులలో వాళ్ళు వుంటారు. ఒక్కొక్క సారి మనతో మాట్లాడే వాళ్ళు కూడా కనబడరు. అక్కడ పుట్టిపెరిగిన మనవళ్లది అదో ప్రపంచం.

ఒక ముసలి తాతయ్య యిక్కడున్నాడని వాళ్ళకు తెలుసో, తెలియదో కానీ, వాళ్ళ ప్రపంచంలో వాళ్ళు వుంటారు. వయస్సులో ఉన్న తేడాలో వున్న కీలకమే అది. ఈ స్వేచ్ఛ, ఈ సందడి అక్కడరాదు. " రామయ్య సంజాయిషి యిచ్చుకుంటున్నాడు, తను అమెరికా వెళ్ళని దానికి కారణాలు వివరిస్తూ.

చివరికి సుబ్బయ్య రామయ్యకు ఒక లాటరీ టిక్కెట్టు అంటగట్టాడు. " దొంగ వెధవ, డబ్బులు కాజేసాడు " అని అనుకుంటూ రామయ్య యింటి వైపు నడిచాడు.

నెలరోజులు తిరిగాయి. ప్రొద్దున్న రామయ్య యింటి తలుపులు తెరిచి చూస్తే బయట చాలా హడవుడిగావున్నాది. ఎంతో మంది మనుషులు పోగయివున్నారు. పత్రికా విలేఖరులు కొందరు సుబ్బయ్యను ప్రశ్నలు వేస్తున్నారు. సుబ్బయ్య కొట్లో అమ్మిన ఒక లాటరీ టిక్కెట్టుకు ఫస్ట్ ప్రైజ్ వచ్చి కోటి రుపాయల బహుమానం వచ్చింది. కానీ యింతకీ ఎవరికి వచ్చిందో తెలియదు.

రామయ్య దగ్గరకు రాగానే సుబ్బయ్య రామయ్య వైపు చూసి " చూడు రామయ్యా ! మన కొట్లో అమ్మిన టిక్కెట్టుకు లాటరీ తగిలి కోటి రుపాయలు వచ్చాయి. నీవు వెళ్ళి నీ టిక్కెట్టు చూడు " అని అన్నాడు.

రామయ్య ఒక్క క్షణం ఆగి సుబ్బయ్య వైపు చూస్తూ, " నాకు లాటరీ తగలటమేంటి, నా మొహం. ఇంత పెద్ద దేశంలో నాకు లాటరీ తగిలే అదృష్టమే వుంటే, జీవితంలో ఎన్నో మార్పులు వచ్చి వుండేవి అనుకొని ఆ రోజే టిక్కెట్టును చెత్త బుట్టలో పారేశాను. " అని అన్నాడు.
" యింకెవరికన్నా తగిలిందేమో ఆ లాటరీ, కనుక్కో " అని అంటూ యింటి వైపు నడిచాడు.

" సుజాతా ! ఫోను రింగవుతుంది, ఎవరో చూడు ! " అన్నాడు ప్రకాశం భార్య వైపు చూస్తూ. సుజాత ఫోను తీసుకుంది. అవతల గొంతు అర్థమయింది తనకు. " మామయ్య గారు ! ఎట్లా వున్నారం"టూ, " ఏమండీ మీ నాన్న గారు ఇండియా నుంచి పిలుస్తున్నారు. " సుజాత ప్రకాశం వైపు చూస్తూ అరచింది.

" నువ్వేమాట్లాడు. ఎలా వున్నాడో కనుక్కో " అన్నాడు ప్రకాశం కంప్యూటర్‌లో చూస్తూ. ఎనభై ఏళ్ళుదాటిన మావయ్యతో ఎప్పుడు మాట్లాడినా ఒకటే ప్రశ్న తప్ప సుజాతకు యింకేమి మాట్లాడాలో తెలియదు.

" అన్నట్టు అమ్మాయీ ! మీ పిల్లల గురించిన వివరాలు నాకు కొన్ని కావాలి. అని అన్నాడు రామయ్య అవతల ఫోనులో కంఠం ఎత్తగలిగినంతగా పైకెత్తి.

" ఎందుకండీ మామయ్య గారూ ? " అని తిరుగు ప్రశ్న వేస్తూ, " అంటే మీ మనవళ్లని గురించిన వివరాలు కావాలా? " అని అడిగింది. తన ముఖంలో వున్న కుతూహలపు

ముఖకవళికలను చూస్తే ప్రకాశానికి కూడా అర్థమయింది ఏదో వింత సంఘటన జరిగిందని.

" ఏం లేదమ్మా ! నాకున్న ఆస్తి మీకు అవసరం లేకపోయినా, నా మనవళ్ళకి యిద్దామనిపించింది. అందుకని కొన్ని వివరాలు అడుగుతున్నాను. " రామయ్య సమాధానమిచ్చాడు. " ఇదిగో మీ అబ్బాయితో మాట్లాడండి " అని సుజాత ఫోనుని ప్రకాశానికిచ్చింది. " ముసలాయనకి ఈ మధ్య మతి భ్రమించిందేమో ? లేక ఏ మైనా పగటికలలు కంటున్నాడేమో ? మనం డబ్బులు పంపందే నెలయినా గడవని ఆయన మన పిల్లలకు తన ఆస్తంతా రాసిస్తాడుట " కొంచెం వ్యంగ్యంగా, మరి కొంచెం వెటకారంగానే అంది సుజాత ప్రకాశంతో.

" ఆయన దగ్గర ఏముంది ? కట్టుబట్టలు, కిర్రు చెప్పలు, ఒక వైపు అద్దం పగిలిన ఒక కళ్ళ జోడు, నడవటానికి, నిలకడకి అనుకూలంగా చేతిలో ఒక కర్ర తప్ప యింకేముంది ఆయన దగ్గర మన పిల్లలకి ఆయన యిచ్చేదేముంది నామొహం " అని సుజాత అంటే -

" పోనీలే, ఏదో ముసలాయన ఆయనకున్న ఆస్తి అంటూ శరీరంలో వున్న అస్థికలే అయినా, ఏదో ఐడియాస్ ఆఫ్ గ్రాండ్యూర్ బుర్రలోకి వచ్చినట్లున్నాయి. ఆయన మనసును కష్టపెట్టడమెందుకు ఉన్న వివరాలు యిస్తే పోలా ! " అని ప్రకాశం రామయ్యతో ఏదో మాట్లాడి కొన్ని వివరాలు యిచ్చాడు.

నాలుగు నెలలు గడచిపోయాయి. అప్పుడప్పుడు రామయ్యతో ప్రకాశం మాట్లాడినా, మనవళ్ళ గురించి రామయ్య యింకేమీ ప్రశ్నలు వెయ్యలేదు. ప్రకాశమే కొంచెం హాస్యంగా " ఏం నాన్నా ? నీ మనవళ్ళకి ఏం ఆస్తి రాసిద్దామనుకుంటున్నావు ? " అని అడిగేవాడు. రామయ్య మటుకు సమాధానం దాటించి మౌనంగా వుండేవాడు.

హఠాత్తుగా ఇండియా నుంచి ఫోను వచ్చింది - రామయ్య మరణించాడని, పనిమనిషి ఇంటికి వెళ్ళి చూస్తే రామయ్య కుర్చీలో కూర్చొని కళ్ళుమూసుకొని వున్నాడు. ఎంత లేపినా లేవలేదని పని మనిషి చెప్తే ప్రక్కన వాళ్ళు ఫోను చేశారు.

ప్రకాశం, సుజాత కలిసి హడావుడిగా ఇండియా బయల్దేరారు. పోనీలే ముసలాయన కష్టపడకుండా కన్నుమూశాడు. ఏదీ సాధించలేక పోయినా, ఎవరనీ సతాయించకుండా తన జీవితాన్ని గడుపుకుని కన్నుమూసాడు. అని మనసులోనే అనుకుంటూ ప్రకాశం ఇండియాలో వున్న యింట్లోకి అడుగు పెట్టాడు. ఒక్క క్షణంలో మనసంతా జలదరించింది .చిన్నప్పటి జ్ఞాపకాలన్నీ మెదడులో మొలకెత్తుతున్నాయి. తను చిన్నప్పుడు నాన్న దగ్గర వుంటే ఎంతో ధైర్యంగా వుండేది. ఆయన చేయి పట్టుకుంటే ప్రపంచంలో ఎవర్నయినా ఎదిరించగలననే శక్తి వచ్చేది. పెద్దయ్యేకొద్దీ ఆ చేతికి, ఆ మనిషికి దూరం అయిపోయాను. పురోగమనమనే

భావంతో, అమెరికాకు లేక వేరే విదేశాలకు తల్లిదండ్రులను వదిలిపెట్టివెళ్ళిన పిల్లలందరూ ధనం సంపాదించారో, లేక విజ్ఞానాన్ని సంపాదించారో కాని కోల్పోయింది యింకా విలువైనది - తల్లిదండ్రుల దగ్గర కలిసివుంటే వచ్చే సంతోషం.

రామయ్యకు దహనక్రియలన్నీ జరిగాయి. సుజాత, ప్రకాశం యింట్లో కూర్చుని వున్నారు. ఆ యింట్లో వున్న ఒక బీరువా ! అందులో రామయ్య గుడ్డలు తప్ప మరేమీ లేవు. ప్రకాశం బీరువా తలుపులు తెరిచి, గుడ్డలవైపు చూశాడు. ఇవి నాన్న కట్టుకునే గుడ్డలు, తనకు మిగిల్చిన ఆస్తి యింతకన్నా ఏముంది ? యివే మనవళ్ళకు ఇవ్వాలనుకున్నాడేమో ? ఒక చిన్న ఆలోచన ప్రకాశం మనసులో మెరుపులా మెరిసింది. ఆ గుడ్డల్ని తీసి చేతిలో పట్టుకున్నాడు. ఇవే తనకు, తన పిల్లలకు నాన్న యిచ్చే జ్ఞాపకాలు అని అనుకుంటూ. ఒక చిన్న కవరు ఆ గుడ్డల మధ్యలో కనిపించింది. ఆశ్చర్యంగా చూసాడు ఆ కవరు వైపు. అందులో ఏముంది ? అనే కుతూహలం కలగక పోలేదు. తీసి చూసాడు. అందులో ఒక లాటరీ టిక్కెట్టు, ఒక చిన్న ఉత్తరం వున్నాయి. ఆ ఉత్తరం తెరిచి చదవటం మొదలెట్టాడు ప్రకాశం.

" ఒరే అబ్బాయి !

పిల్లలు బాగా చదువుకొని పైకి వృద్ధిలోకి వచ్చారనే సంతోషం, పరదేశాలకెళ్ళి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుంటున్నారనే గర్వం యిదివరలో ఉందేమో కాని, ఈ వృద్ధాప్యం వచ్చేటప్పటికి మీరెవ్వరూ నాదగ్గర లేరనే దిగులు యిది వరలో వున్న అహంకారాన్ని పటాపంచలు చేసింది. ఈ వయస్సులో నాకు కావలసింది మీ అక్కాంప్లిష్మెంట్స్ కాదు. మీరు నా దగ్గర ఉండటము. రామలక్ష్మణుల లాంటి కొడుకులు వున్నా, దశరధునికి శాపం వల్ల పుత్రులకు దూరంగా వుండి చివరకి పుత్రవియోగంతోనే కళ్ళుమూసాడు. నాలాంటి వాళ్ళ పిల్లలు చాలా మంది అమెరికాలో వున్నా, కొంత మందికే పిల్లల దగ్గర ఉండటానికి వీలయింది. దశరధుడి లాంటివాడికే అలా జరిగితే నాలాంటి వాడి కేముందిలే అని సర్దిపెట్టుకుంటున్నాను.

ఈ వయస్సులో యిప్పుడు మీకు యివ్వగలిగింది ఏమీలేదు. నాకన్నా మీరు ఎంతో ఎక్కువగా ఎదిగారు కాబట్టి నాదగ్గర్నుంచి మీకు కావాల్సింది కూడా ఏమీ లేదు. నా మనవళ్ళతో నాకు ఎక్కువ పరిచయం లేక పోయినా, ఈ రక్తసంబంధంతో వాళ్ళకు నేను తాతయ్యనయ్యాను. వాళ్ళు పెద్దయిన తర్వాత మా తాతయ్య మాకు ఏమీ యివ్వలేదని అనుకోకుండా చూడు.

మన యింటి పక్కన వున్న బంకులో సుబ్బయ్య నాకు ఈ లాటరీ టికెట్టు అమ్మాడు. అప్పడు వాడు దొంగవెధవ, నా దగ్గర ఇరవైరూపాయలు కొట్టేయడానికి అమ్మాడనుకొన్నాను.

కాని యిప్పుడు దానికి లాటరీ తగిలి కోటిరూపాయలు వచ్చాయి. ఈ వయస్సులో ఆ డబ్బుతో నాకు యిప్పుడు పనిలేదు. మీకు అవసరం లేకపోవచ్చు. ఒక వేళ ఆ సుబ్బయ్యకే యిద్దామనుకుంటే వాడికీ నాలగే డెబ్భై ఏళ్ల పైనే వున్నాయి. అందుకని ఈ డబ్బు నా మనవళ్ల పేరున యిద్దామనుకుంటున్నాను. వాళ్ల పుట్టిన రోజున మిమ్మల్నందరిని సర్‌ప్రైజ్ చేయాలనుకున్నాను. ఈ లాటరీ టిక్కెట్టుని ఏడాదిలోగా ప్రభుత్వానికి చూపించి డబ్బు తీసుకోవచ్చు .

ఇట్లు

**" మీ నాన్న రామయ్య."**

ప్రకాశానికి కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. ఆ ఉత్తరాన్ని సుజాతకు అందించాడు. అమెరికా వచ్చి ముప్పైఏళ్లలో ఏదో సాధించి, ఎంతో సంపాదించినా, ఇండియా వదిలి వచ్చి అంతకన్నా విలువైన తల్లిదండ్రుల ప్రేమని పోగోట్టుకున్నాడు. వాళ్లతో కలిసివుండిన సంతృప్తి మరలా తనకి ఈ జీవితంలో రాదు.

---

తన దగ్గర డబ్బులు లేకపోయిన, పిల్లలకు చదువులే ముఖ్యమని తలచి అప్పుచేసి అయినా మమ్మల్ని చదివించాలనే ఉద్దేశ్యంతో ఎన్నోకష్టాలు పడి నన్నూ , నా తమ్ముళ్లని యింత పెద్దవాళ్లని చేసిన మానాన్న మాచిరాజు కోదండ రామారావు గారికి ఈ కథ అంకితం.

----- మాచిరాజు వెంకటరత్నం

---

మాచిరాజు వెంకటరత్నంగారు అమెరికా భారతి పాఠకులకు సుపరిచితమే. వారి స్వస్థలం ఒంగోలు. గుంటూరు మెడికల్ కాలేజిలో ఎమ్.బి.బి.యస్. పట్టాపొంది 1971లో యు.యస్.ఎ.కు వచ్చారు. పిట్స్‌బర్గ్‌లో హార్ట్ సర్జన్ గా పనిచేస్తున్నారు. ఇంతకు ముందు " అమ్మ " " సంధ్యావందనం " " పిల్లలూ వెళ్ళొస్తాము " మరియు " ఏకపత్నీవ్రతుడు " అనే కథలు వ్రాసారు. వంగూరి ఫౌండేషన్ వారి ఉగాది కథల పోటీలలో " సంధ్యావందనం " " పిల్లలూ వెళ్ళొస్తాము " కథలు రెండవ బహుమతి గెలుచుకున్నాయి. " అమ్మ " కథ అమెరికా తెలుగు కథ పుస్తకములోనూ, వార్త మేగజిన్ లోను ప్రచురింపబడినవి. " సంధ్యావందనం " కథ 2004 కథా వాహిని పుస్తకంలోను, " పిల్లలూ వెళ్ళొస్తాము " మరియు " ఏక పత్నీ వ్రతుడు " అమెరికా భారతి లోను ప్రచురింపబడినవి.



# ద్వంద్వ ప్రవృత్తి

## 2007 అమెరికా భారతి కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

డా॥ సురేంద్ర కె. దారా

బజారుకి వెళ్ళి వస్తూండగా సీతారాముడు గుర్తొచ్చాడు. చాలా రోజులయింది వాడిని కలసి. ఓసారి పలకరిద్దామని వాడి ఇంటి వైపుకి దారితీసాను. గుమ్మంలో అడుగు పెట్టగానే " ఏమిట్రా కృష్ణా, ఇన్నాళ్ళకా కనిపించడం? ఆ మధ్య మీ ఇంటికి వచ్చి నపుడు కూడా లేవు నువ్వు. నిజానికి ఒకటి రెండు రోజుల్లో నేనే మళ్ళీ వద్దామనుకుంటున్నాను. పోనీలే ఇప్పటికైనా గుర్తుంచుకొని వచ్చావు. రా రా " . అంటూ అహ్వానిస్తూనే అక్షింతలు వేస్తూ లోపలికి తీసుకు వెళ్లాడు. నే నీ మధ్యలో కనబడక పోవడానికి కారణం చెప్పినా వినే రకం కాదు కాబట్టి సమాధానంగా నవ్వి వూరుకున్నాను.

కుశల ప్రశ్నలైన తరువాత ముఖ్యమైన విషయంగా వాడు చెప్పినది వాళ్ళబ్బాయి పెళ్ళి సంబంధం గురించి. " మా వాడి పెళ్ళి దాదాపు ఖాయమైపోయినట్టేనోయ్. " అంటూ వివరాలు చెప్పాడు. ఈ మధ్య చూసిన సంబంధాల్లో రెండు బాగా నచ్చాయట. చదువు  సంధ్యల్లోనూ, ఆస్తి పాస్తుల్లోనూ రెండు సంబంధాలూ దాదాపు ఒకే రకంగా ఉన్నాయట. అందులో ఒకమ్మాయి ఓ మోస్తరుగా ఉంటుంది కానీ మంచి వినయ విధేయతలున్న పిల్లని అందరూ చెప్పారట. రెండవ అమ్మాయికి కాస్త అహంభావం ఎక్కువని తెలిసిందట. పెళ్ళిచూపుల్లో వాళ్ళబ్బాయితో మాట్లాడినపుడు తనకి కోపం ఎక్కువని తనే స్వయంగా చెప్పిందట కూడా. కానీ ఆ అమ్మాయి కుందనపు బొమ్మలా వుంటుందని, చిదిమి దీపాన్నీ, గోకి గోరింటాకునీ పెట్టుకోవచ్చులాంటి వన్నీ చెప్పి. " ఒక్కతే అమ్మాయి అవడంతో కాస్త గారాబంగా పెంచినట్టున్నారు. మనం దారిలో పెట్టుకుంటే కోపం గీపం అవేదారిలో కొస్తాయి. అందరం ఆలోచించిన మీదట ఆ సంబంధాన్నే ఖాయం చేయ్యాలనుకుంటున్నాం. " అన్నాడు.

తిరిగి ఇంటికి వచ్చేప్పుడు సీతారాముడు చెప్పిన దాని గురించే ఆలోచనలో పడ్డాను. సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అన్నందుకేనేమో కంటికింపుగా కనబడిన ప్రతిదాని విషయంలోనూ మనిషి ప్రలోభపడుతుంటాడు.  రూపం ముఖ్యమా, గుణం ముఖ్యమా అంటే గుణమే ముఖ్యం అనిపిస్తుంది.  అందంగా వుందని ప్రతి పువ్వునూ పూజకు వాడలేము. కంటికింపుగా కనిపించిందని ప్రతి పండునూ  తినలేము. ప్రొద్దుట లేచింది మొదలు ప్రతి పనీ సవ్యంగా జరగాలంటే మనం చేసే విధానం సరిగా ఉండాలి. మనం కలిసి పనిచేసే లేదా మనకి ఎదురయ్యే వ్యక్తుల ప్రవర్తన సరిగా ఉండాలి. అంతేగానీ వారి రూపురేఖలతో పనిలేదు. అయినప్పటికీ రూపానికున్న

ప్రాముఖ్యత గుణానికి లేదు.

ఏమిటో ఈ లోకరీతి అనుకుంటూ ఇంటికి వచ్చిన నేను సీతారాముడి కొడుకు పెళ్ళి సంబంధం గురించీ, నా ఆలోచనల గురించీ మా ఆవిడకి చెప్పాను. “ కోపిష్టి మనిషని తెలిసీ ఆ పిల్ల అందంగా వుందనీ కక్కుర్తి పడుతున్నారు. ” “ అందంగా ఉన్న అమ్మాయి భార్య కావాలను కోవడంలో ఆ అబ్బాయి తప్పేముందండీ ?” అంది తను. “ తప్పనీ నేనూ అనడంలేదు. మన కాలంలోలా సర్దుకుపోయి సంసారాలు చేసే రోజులు కావు కదా ఇవి ? అలవాటయ్యాక మనిషికి కనిపించేది అందం కాదు. ప్రవర్తన. వాళ్ళన్నట్టు పెళ్ళయ్యాక ఈ అమ్మాయి బుద్ధిమంతురాలు అవ్వచ్చు. అది కాదనను. రెండవ సంబంధం వాళ్లమ్మాయి మంచిదని తెలిసుండీ రూపాన్ని చూసి ప్రలోభ పడే వింత ప్రవృత్తే నాకెప్పటికీ బోధపడదు. ” అన్నాను. కరణేషు మంత్రీ, కోపిస్తే కాళీ అయిన మా ఆవిడ ఆక్షణాన బుద్ధిలో (ఆడ) బృహస్పతి అయి ఓ చిన్ననవ్వు నవ్వి “ మీరనుకున్నట్లు మనుషులది వింత ప్రవృత్తి కాదు, ద్వంద్వ ప్రవృత్తి .” అని చెప్తూ నన్ను సందిగ్ధంలో పడేసింది. అమాయకత్వమూ, అజ్ఞానమూ, వెఱ్ఱిబాగులతనమూ నా ముఖంలో ఒకదాని తరువాత ఒకటి సీరియల్ లైట్ల సెట్టులో బల్బుల్లా వెలిగాయో ఏమో మళ్ళీ చెప్పడం మొదలుపెట్టింది.

“ సగటు మనిషన్న వాడు మంచివాడూ కాదు, చెడ్డ వాడూ కాదు, మంచిచెడుల కలయిక వల్లే అతను సగటు మనిషి అవుతాడు. రూపాన్ని చూసి మోసపోయే మానవుడే మనిషికి రూపం కన్నా మనసే ముఖ్యం అని మనస్ఫూర్తిగా నమ్ముతాడు. దీనికి చిన్న ఉదాహరణ చెప్తాను.మన పెళ్ళైన కొత్తలో మీ ఊరికి వెళ్ళిన పుడో సినిమా చూసాం గుర్తుందా ?” ఒక్కసారిగా గొంతులో పచ్చి వెలక్కాయ ముక్క ( వెలక్కాయ మొత్తం గొంతులో పడిందనడానికి నేనేమైనా ఏనుగునా? మనిషి గొంతులో వెలక్కాయ ముక్క మాత్రమే పడుతుంది.) పడినట్టూ, చదవని పాఠంలోని ప్రశ్న అడిగి నట్టూ అనిపించి భయం వేసి చచ్చింది. ఈ ఆడవాళ్ళకి ఏం గుర్తున్నా లేక పోయినా మొగుళ్ళని ఇరకాటంలో పెట్టడానికి పెళ్ళైన క్రొత్తలో సంగతులన్నీ బాగా గుర్తుంటాయి. సంకోచిస్తూనే సాలోచన చేసి “ ఏ సినిమా గురించి అడుగుతున్నావు?” అని సమాధానాన్ని ప్రశ్నా రూపంలో సంధించాను. ‘ మీ తెలివికి సంతోషించాంలే గానీ’ అన్న అర్థంలో చిన్న నవ్వు నవ్వి “ గురువుని మించిన శిష్యుడు సినిమా అండీ, విఠలాచార్యదో ఎవరిదో, ఎప్పుడో చూసిన సినిమా అయినా నాకు బాగా గుర్తుండి పోయింది ఓ సంఘటన కారణంగా.

ఆ రోజు సినిమా హాలు దగ్గర ఒక మరుగుజ్జు అతను వచ్చాడు. హాలు దగ్గరి జనం, వారి సంస్కారపు స్థాయిని బట్టి ముసిముసిగానో, బిగ్గరగానో అతన్ని చూసి నవ్వుకున్నారు. “ అయితే దానికీ దీనికి సంబంధం ఏముంది ?” అన్నాను. ఆ సంఘటనేదో లీలగా గుర్తొస్తుండగా మధ్యలో తనని ఆపుతూ, “ అదే చెబుతున్నాను వినండి ” అంటూ కొనసాగించింది. “ జనాలకి అతని గురించి

ఏంతెలుసని ఆ నవ్వులాట? కేవలం రూపాన్ని చూసి నవ్వేయ్యడమేనా ? అలాంటి అనుభవాలు అలవాటైపోయినా, ఆ మనిషి ఎంత బాధపడి వుంటాడో కదా. అతను చాలా తెలివైన వాడు కావచ్చు, మంచి వాడు కావచ్చు, గొప్ప వ్యక్తిత్వం ఉన్నవాడు కావచ్చు. కానీ కనిపించని గుణం కన్న, కంటికి కనిపించే రూపమే ఆక్షణాన వారి రియాక్షన్ కి కారణమయ్యింది. మనుషులు ఇంతే కదా అనుకుని సినిమా హాలులోకి వెళ్ళిన మనకి మరో విషయం బోధపడింది గుర్తుందా?" దీంతో నాకు జరిగిన విషయం, మా ఇద్దరి మధ్య ఆ రోజు జరిగిన సుదీర్ఘ చర్చా గుర్తు రావడంతో, మిగతా వివరాలు చెప్పడం ప్రారంభించాను నేను. " ఆ సినిమాలో మాంత్రికుడు ప్రాణం పరకాయ ప్రవేశ విద్య ద్వారా నాయకుడి శరీరం లోకి ప్రవేశించి రాకుమారి దగ్గరకు వెళ్ళగానే జనాలు హాహాకారాలు చేసారు. చివరిలో నాయకుడి ప్రాణం తిరిగి తన శరీరంలోనికి ప్రవేశించి మాంత్రికుడి పీచ మణచగానే అందరూ కేరింతలు కొట్టారు. "

" మీకూ బాగానే గుర్తొచ్చిందే " అంటూ తన విశ్లేషణని పూర్తి చేసింది. " మరుగుజ్జు మనిషి రూపం చూసి నవ్విన జనాలే, బాహ్య రూపం నాయకుడిదే అయినా, ప్రాణం మాంత్రికుడిదయ్యే సరికి ఎలా స్పందించారో చూసారా ? రూపం కన్న గుణం ముఖ్యమన్న విషయం మన మనసుల్లో ఎంత గాఢంగా ఉండకపోతే అలాంటి సన్నివేశాలకి ఆవిధంగా స్పందిస్తాం చెప్పండి ? వ్యక్తుల యొక్క నడవడికే అందరికీ ముఖ్యం. కానీ ఆచరణలోకి వచ్చేసరికి అందరం సులభంగా ప్రలోభాలకు లోనౌతూ వుంటాం. దీన్నే ద్వంద్వ ప్రవృత్తి అంటున్నాను. " నాకు ఈ సత్యాన్ని విడ మరచి చెప్పేంతటి తెలివితేటలూ, ఆలోచనా శక్తీ వున్న నా భార్యను ఎన్నుకునేప్పుడు నేను తన రూపాన్ని చూసానా, మనసునీ చూసానా అని ఆలోచిస్తూ, "ఏవన్నా తిందురుగాని రండి," అంటూ లేచి లోపలికి వెళ్ళిన మా ఆవిడ వెనుకే అడుగులు వేసాను.

---

డా॥ సురేంద్ర వృత్తిరీత్యా ఎంటమాలజిస్ట్ . కాలిఫోర్నియాలోని వాస్కోలో ఒక బయో పెస్టిసైడ్ కంపెనీలో ఉద్యోగం. బేకర్స్‌ఫీల్డ్ నగరంలో నివాసం, కవితలు, వ్యాసాలు, కథలను వ్రాస్తుంటారు. రచన మాసపత్రిక నుండి కథాపీఠం పురస్కారంతో బాటు సిలికానాంధ్ర, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా మొదలైన వారి నుండి బహుమతులు అందుకున్నారు. స్థానిక దినపత్రిక లో అప్పుడప్పుడు వ్యాసాలు వ్రాస్తుంటారు. నవ్వుతూ బ్రతకండి అంటూ ఇటీవలే laughtolive.org అనే సంస్థని స్థాపించిన ఈయన బేకర్స్ ఫీల్డ్ లోని తెలుగు పిల్లలకు తెలుగు పాఠాలు కూడా చెబుతారు.




రేడియో నాటికలుగా
బేతాళ కథలు
వజ్రోత్సవం జరుపుకుంటూన్న చందమామలో గత యాభైయేళ్ళకుపైగా
ఆబాలగోపాలాన్ని అలరిస్తున్న బేతాళ కథలు ఇప్పుడు–వరల్డ్ స్పేస్ శాటలైట్
ఛానల్ నం. 107, రేడియో 'స్పందన'పై
నాటికలుగా ప్రసారం కానున్నాయి.
ఆహ్లాదకరమైన కథల ద్వారా మానసిక విశ్లేషణతో, తర్కంతో, జీవితంలో ఎదురయ్యే
ధర్మసందేహాలకు చక్కని సమాధానాలు తెలియజేసే నిత్యనూతనమైన బేతాళ కథలను
ఇప్పుడు వీనుల విందుగా రేడియో నాటికలుగా 'స్పందన'లో విని ఆనందించండి!
విజయదశమి నుంచి ఉదయం 8.30–9.00 (IST)గం.ల మధ్య ప్రసారం కానున్నది.
ఆ తరవాత ప్రతి 1,3 ఆదివారాల్లో అదే సమయానికి ప్రసారమవుతాయి.
వివరాలకు http://worldspace.msnserver.com/log on చేయవచ్చు.
DEEPAVALI – MAKARA SANKRANTI SPECIAL OFFER
to members of American Telugu Association
On annual subscription (12 issues by air mail)
For Chandamama Telugu or any of the other 12 languages
and Junior Chandamama US $ 25/=
Mail your remittances to : CHANDAMAMA INDIA LTD
82 Defence Officers Colony, Ekkatuthangal, Chennai 600 032
For more details visit our website :
http:/www.chandamama.org
WORLDSPACE
SATELLITE RADIO
SPANDANA
Website : www.worldspace.in

# టెక్సస్‌లో ఇక " నెల నెలా తెలుగు వెన్నెల "

అమెరికాలోని లోన్‌స్టార్ రాష్ట్రంలో 'తెలుగు స్టార్' వెలిసింది. మరదేమిటో తెలుసా ? "పంచదారకన్న, పనసతొనలకన్న, కమ్మని తేనెకన్న మిన్న" అయిన మన తెలుగు భాష సేవకోసం మన తెలుగువారు స్థాపించిన " తెలుగు సాహితీవేదిక". ఈ సంవత్సరం జూలై నెలలో తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సస్ (టాన్ టెక్స్) వారి ఆధ్వర్యంలో " తెలుగు సాహితీ వేదిక " ను ప్రముఖ రచయిత గొల్లపూడి మారుతీరావు గారు, తెలుగు యూనివర్సిటీ ఉపాధ్యక్షురాలు డా॥ ఆవుల మంజులత గారు ప్రారంభించిన విషయం మనలో చాలా మందికి తెలిసిన విషయమే. ఈ వేదిక ఆశయాలకు శ్రీకారం చుడుతూ ఆగష్టు 19వ తేదిన తమ మొట్టమొదటి కార్యక్రమము **" నెల నెలా తెలుగు వెన్నెల "** ను ఇర్వింగ్ లోని ఇండ్యాఫ్యూజన్ రెస్టారెంట్‌లో శ్రీ ప్రసాద్ తోటకూర (తానా ప్రధానకార్యదర్శి మరియు స్థానిక సాహిత్యవేత్త) ఆధ్వర్యంలో దిగ్విజయంగా నిర్వహించబడినది.

హ్యూస్టన్ నివాసి, ప్రముఖ సాహితీవేత్త, రచయిత, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా అధ్యక్షులు, ఇంతకు ముందు అమెరికా భారతి సంపాదకులు డా॥ చిట్టెన్ రాజు గారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయగా టాన్‌టెక్స్ అధ్యక్షులు డా॥ రాజారెడ్డి కార్య క్రమానికి అధ్యక్షత వహించారు. సభ్యులు తమను పరిచయం చేసుకున్న తరువాత, శ్రీ తోటకూర ప్రసాదు గారు ప్రారంభోపన్యాసం చేస్తూ, ఈ వేదిక స్థాపనోద్దేశ్యాలను, ఆశయాలను వివరించారు. తదుపరి తన ప్రధానోపన్యాసంలో డా॥ వంగూరి చిట్టెన్ రాజు గారు ఈ వేదికకు అనుగుణమైన కార్యక్రమాలు ఎలా వుండాలి, చక్కని అంశాల్ని ఎలా ఎన్నిక చేయాలి, ఏయే అంశాలు ఉండాలి, వేదిక ప్రతి నెల విజయవంతం కావడానికి సాహిత్యం - హాస్యం - పాటలు - నాటకీయత ఎలా మిళితం కావాలి అనే విషయాలపై సృజనాత్మ కమైన సూచనలు చేయటమే కాకుండా, మాతృదేశం లోనూ, అమెరికాలోనూ నెలకొన్న ప్రస్తుత పరిస్థితులలో తెలుగు భాష, సాహిత్యాల పెంపుదలకి అందరూ చేయగలిగినసహాయ సహకారాలపై అనేక సంవత్సరాలతమ అనుభవాలని విశదీకరిస్తూ వేదిక అభివృద్ధికి కీలకమైన సూచనలు చేసారు. ఆంధ్రప్రదేశ్ తో సహా ప్రపంచంలో ఉన్న అందరు తెలుగువారు ప్రతీరోజూ ఒక గంట సేపు ఏదో ఒక తెలుగు పుస్తకం చదవడం, నెలకొక తెలుగు పుస్తకం కొనడం, సాహితీ ప్రియులు ఇటువంటి " నెల నెలా తెలుగు వెన్నెల " కార్యక్రమాలను ప్రతి ఊళ్ళోనూ నిర్వహించడం, ఎన్నారై తెలుగు వారు తమ పరపతిని ఉపయోగించి , ఇండియా వెళ్ళి నపుడల్లా కనీసం ఒక పూటయినా కేటాయించుకొని ఇటువంటి వేదికను తమ ప్రాంతాలలో నిర్వహించడం మొదలైన చిన్న, చిన్న మౌలికమైన కార్యక్రమాల ద్వారా తెలుగుభాష, సాహిత్యం రాష్ట్ర, దేశ స్థాయిలనుంచి ప్రపంచ స్థాయికి ఎదిగే అవకాశాలు

ఉన్నాయి అనీ, ప్రభుత్వాధికారులూ, మేధావి వర్గాలూ, భాషా శాస్త్రవేత్తలూ, కార్పోరేట్ రంగం వారూ ఈ రోజుల్లో తరచు వినిపించే ప్రసంగాలని ఆచరణలో పెట్టడానికి ఇటువంటి స్వలాపేక్ష లేని సమావేశాలే మూలకారణాలుగా నిలుస్తాయి. కాబట్టి ఇటువంటి చిత్తశుద్ధిగల " గ్రాస్‌రూట్స్ " ఉద్యమాలకి అందరూ, అన్ని విధాలుగానూ సహకరిస్తారనీ, అప్పుడే తెలుగు భాష అభివృద్ధికి ఈ రోజుల్లో అత్యవసరమైన " గ్లామర్ " మరియు సంపన్న వర్గాల మద్దతు, పోషణ లభిస్తుందనీ, శ్రీ చిట్టెన్ రాజు గారు అభిప్రాయపడ్డారు.

మనసా, వాచా కర్మణా మన భాషని, సంస్కృతిని మనం గౌరవించుకుంటేనే కేంద్రప్రభుత్వం వారి ప్రాచీన భాషాప్రతిపత్తి కానీ, యునైటెడ్ నేషన్స్ వారి " మరణంచబోయే భాషల పట్టీ " లోంచి తొలగించడం కానీ జరుగుతుందనీ ఆయన స్పష్టం చేశారు. తరువాత టాన్‌టెక్స్ అధ్యక్షులు శ్రీ రాజారెడ్డి గారు మాట్లాడుతూ ఈ వేదికకు తమ పూర్తి సహకారాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సభ్యులు వేదిక అభివృద్ధికి చాలా ఉపయోగకరమైన, వినూత్నమైన సూచనలు చేశారు. మరి తరువాత సభ్యులు ప్రదర్శించిన ఉత్తమ స్థాయి సాహితీ వైదుష్యం, పటిమ కార్యక్రమానికి వినోదాన్ని, ఆహ్లాదాన్ని సమకూర్చాయి. ప్రముఖకవి, అవధాని " నీలదంత " గారి స్వీయకవితలు, డా॥ ఆళ్ళ శ్రీనివాసరెడ్డిగారు తమ మధుర గాత్రంతో పాడిన జానపదగేయాలు మరియు 60వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా వింజమూరి శివరామారావు మొదలైన వారి దేశభక్తి గీతాలు, " అమెరికా హాస్యబ్రహ్మ "వంగూరి చిట్టెన్‌రాజు గారు చదివిన హాస్య కవితలు ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి. డా॥ పూడూరు జగదీశ్వరన్ గారు రచించి చదివిన " మిరపకాయ బజ్జీ విలాపము " పద్యానికి విశేష స్పందన లభించింది. మీ అందరి కోసం మరి ఆ పద్యాన్ని ఇక్కడ మీకూ అందిస్తున్నాము.

### " మిరపకాయ బజ్జీ విలాపము "

ఉ ॥ పుట్టితి ఆంధ్ర దేశమున పొందితి ఆంధ్రుల చేవ ధాటిగా
పుట్టితి ఛత్రమున్ మిరప బజ్జిగ నేలితి ఆంధ్ర భోజ్యమున్
మెట్టితి డల్లనున్ జనులు మెచ్చ సుభాష్ చలసాని " లాఘవం
బట్టుగ నాకు పట్ట పర మార్గము జెందితి కాని చెప్పెదన్
గట్టిగ ఈ ప్రవాసులు సగంబుగ అల్పినొ కోసి పిండిలో
గుట్టుగ ముంచి ముంచి మరి గుండ్రని రూపము నిచ్చి బజ్జిగా
పెట్టగ పేరు నాకు విలపించుట దప్ప మరేమి జేతునో

# టెక్సస్‌లో ఇక “నెల నెలా తెలుగు వెన్నెల”

కార్యక్రమంలో చివరిగా సభికుల సూచనలను సమీక్షిస్తూ శ్రీ తోటకూర ప్రసాద్ గారు ప్రతిపాదించిన నిర్ణయాలను అందరూ ఆమోదించారు. ఇక నుంచీ ప్రతీ నెలా మూడవఆదివారం క్రమపద్ధతిలో ఒక్కొక్కసారి ఒక్కొక్క రెస్టారెంట్ లో ఈ “ నెల నెలా తెలుగు వెన్నెల ” సాహిత్యవేదిక నిర్వహించాలని నిర్ణయించబడినది. దీనికి స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాహితీవేత్తలను ఆహ్వానిస్తారు. అప్పటికప్పుడు ప్రకటించిన విరాళాల ఆవశ్యకతకు సభ్యులు స్పందించి ఉత్సాహంగా, వెనువెంటనే విరాళాలు కురిపించారు. శ్రీ ప్రసాద్ తోటకూర వందన సమర్పణ చేస్తూ, ఇండ్యాఫ్యూజన్ రెస్టారెంట్‌కు చెందిన చేకూరి కోటేశ్వర చౌదరి (కెసి) గారికీ, ఇతర ప్రముఖులకీ కృతజ్ఞతలు తెలిపారు.

అమెరికాభారతి మరియు అమెరికా తెలుగు సంఘం తరపున తెలుగు భాషాభ్యుదయ దృష్టితో వెలసిన ఈ సాహితీవేదికకు అభినందనలు మరియు జోహార్లు. ఈ వేదికను స్ఫూర్తిగా తీసుకొని మరెన్నో రాష్ట్రాల్లో (అమెరికాలో), మరెన్నో ప్రాంతాల్లో (ప్రపంచవ్యాప్తంగా) ఇటువంటి వేదికలు స్థాపించబడతాయని, స్థాపించబడాలని ఆశిస్తున్నాము.




ఈ కార్యక్రమం గురించి విషయాలను మా కందించిన శ్రీ తోటకూర ప్రసాద్ గారికి,

శ్రీ చిట్టెన్ రాజు గారికి మా కృతజ్ఞతలు -------- సంపాదకుడు.

# ఆటా 2008 మహాసభల స్మారక సంచిక (Souvenir)
## రచయితలకూ, కవులకూ, చిత్రకారులకూ ఆహ్వానం !

న్యూయార్కులో జరగబోయే ఆటా మహాసభల సందర్భంగా ప్రచురించబడే ప్రత్యేక స్మారక సంచికకి మీ రచనలు – కథలు, కథానికలూ, వ్యాసాలు, కవితలూ, నవలికలూ, నాటికలూ – ఎటువంటి సాహిత్యప్రక్రియ అయినా – పంపవలసినదిగా ఆహ్వానిస్తున్నాము.

ఈ రాబోయే మహాసభ ఆటా వారి 10 వది... కనుక ఈ సంచిక నినాదం (theme) "**దశమావతారం**" గా పెట్టాలని ఆటా వారి కోరిక. దీనిని మీకు అనుకూలంగా (వీలయితే) మీ రచనలలో వాడుకోవచ్చును.

ప్రచురణకి పంపే మీ రచనలు క్రొత్తవయి వుండాలి . వేరే ఎక్కడా ప్రచురింపబడి వుండకూడదు. సూవెనీర్ విడుదలయ్యే వరకూ (లేదా సూవెనీర్లో ప్రచురించలేదని తెలియపరిచేవరకు) వీటిని ఎక్కడికి ప్రచురణకి పంపరాదు.

ఇది అమెరికా తెలుగు సంఘం సూవెనీర్ కాబట్టి అమెరికా నివాసులకు సంబందించిన రచనలకు ప్రాముఖ్యత ఇవ్వబడుతుంది . అమెరికాలో నివసించే రచయితలకు కూడా ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. రచనలు తెలుగులో గానీ ఇంగ్లీషులో గానీ వుండవచ్చును.

మిగతా వివరాలూ, సూచనలూ అవీ నెమ్మదిగా ఆలోచించి మీకందరికి అందజేస్తాము. ఇదాక తొలి ప్రకటనగా భావించి మీరు మీ కావ్యాలకు శ్రీకారం చుట్టవలసిందిగా కోరుతున్నాము.

మీ అందరి సహాయం తో, దీవెనలతో, ఈ సూవెనీరు "నభూతో నభవిష్యతి " అనిపించుకునేలా చేయాలని మా కోరిక.

**ఇట్లు**

శ్రీనాథ్ జొన్నవిత్తుల, సంపాదకుడు

అప్పారావు సుంకర, సహ సంపాదకుడు

భార్గవి రావు, సహ సంపాదకురాలు

# నృపా హృదయం

ఎమ్.టి.ఎస్ రాజు

" మన హృదయం ఎక్కడ ఉంటుందో అదే మన యిల్లు " అని అన్నారు పెద్దలు. విద్యాసముపార్జనరీత్యా, ఉద్యోగరీత్యా మనం మనవారిని వదిలి దూరంగా ఉన్నా, వారిని గురించి ఆలోచనలు మనల్ని వారికి చేరువగానే ఉంచుతాయి. ఒకసారి ఒక చిన్న అమ్మాయిని ఎవరో అడిగారంట " మీ ఇల్లెక్కడ పాపా !" అని మరి ఆ పాప సమాధానమేంటో తెలుసా ? " ఎక్కడైతే మా అమ్మ ఉంటుందో అదే మా ఇల్లు " అని. అలాగే, ఇక్కడ మనకు ఎంత పెద్ద, ఎంత విశాలమైన, అందమైన ఇల్లు ఉన్నా, మన " తల్లిదండ్రులు ఉండే" మన ఊరిలోని " ఆ ఇంటికి " సాటి ఏదిలేదు. ఎందుకంటే, ఆ ఇల్లు ఇటుకలు, చెక్కలతో కట్టినది కాదు - అది ప్రేమ, అభిమానం, అప్యాయత, అనురాగం అన్నిటితో కలిపి కట్టినది. మన తల్లిదండ్రులందరు తరచూ కలుసుకొనే ఇల్లు మరొకటుంది- అదే "నృపా" NRI * Parents Association (NRIPA). మరి ఈ నృపా సంఘం గురించి, వారి " హృదయం"లో మన ఎడల భావాల గురించి ఎంతో మధురంగా ఈ పద్యాల రూపంలో మనకు తెలియ చేస్తున్న శ్రీ రాజుగారికి నా " హృదయ" పూర్వక వందనాలు. ---- సంపాదకుడు.

---

సీ :- అమెరికా, కెనడా, దుబాయి, యింగ్లండాది పరదేశములకేగి ప్రజ్ఞ చూపి
భారత భువి పేరు, పరదేశముల పేరు, ఖ్యాతికెక్కించిన ఘనతగాంచి
కన్నవార్కి, మనకు, కడమ మిత్రులకును, బంధువర్గమునకు ప్రమదమెసగ
సతతసుఖావాప్తి సత్కార్యచణ దీప్తికాలవాలంబౌచునవనిమించు

తే.గీ.:- పుత్రికాపుత్రులను గన్న పుణ్యధనుల
మెల్లరము " నృపా" యంచును సల్లలితము
రాజవాచకముగ గూడి రాణకెక్కు
సంస్థమాయది ; పేరెద్ది సాటివచ్చు ?

ఉ :- ఇంతగపేరు మోసి, మరియెంతయుకీర్తి ప్రమోద సంపదల్
సొంతముఁజేసి కొన్న మన సూనులు, సూనలు, నెమ్మనంబులన్
చింతిలుచుండ్రు " మాపితరుసేమములన్ సమకూర్చినిచ్చలున్
చెంతనెయుండజాలమెటు చేకురఁజేతుమొహర్షమం" చొగిన్

చ :- మనసుఖమే ముదంబనుచు మానసమందుననెంచు వారికిన్
ఘనమగు హర్షమేర్పరుపగా మనమెల్లర మెల్లవేళలన్
కనపడుచుండగావలయుఁగౌతుకమొప్పసుహృత్సఖాళితో
ననయముఁగూడి, మోదమున నాడుచు, పాడుచువేడ్కనవ్వుచున్.

మ :- ఇది సాధ్యంబు "నృపా" సభాసదులు సన్మిత్రాళిగానెయ్యమున్
హృదిమేల్కొల్పియనారతంబునొకట్టై, యెవ్వారికష్టంబునేన్
తుది ముట్టింపగజేయగల్గుటయె సంతోషంపుటంచంచునె
మ్మది నెంచన్మన సూన సూనులునుసన్మైత్రింబ్రహర్షింపరే!

శా :- " ఏమెవ్వారము తోడనుండకయు మీకేలోటు లేకుండ మీ
రామోదంబున నొక్కరొక్కరికి నైరంజిల్లు సన్మైత్రితో
సామూహప్రబలాప్రయోజనమునన్ సాధ్యంబు సౌఖ్యంబనన్
సామర్థ్యంబునఁదెల్పినారల"నుచున్, సంతోషమున్గాంచరే!

క :- అందరు నొక్కట గూడియు
"మంద"యగున్ మదికలయమి; మనమొకటిగనౌ
చందము వెలయగ మన "నృప"
"సుందరకూటమి"గ నిలనుశోభిల్లవలెన్. ..............................

శ్రీ ఎమ్.టి.ఎస్. రాజుగారి జననం తూర్పుగోదావరి జిల్లా ఊడిమూడి గ్రామంలో, హైస్కూల్ విద్య అక్కడకు దగ్గరున్న నరేంద్రపురంలో. ఎస్.ఎస్.ఎల్.సి. లో బంగారు పతకం సాధించి, విశాఖపట్నంలో పి.యు.సి. మరియు అత్యున్నత శ్రేణిలో బి.టెక్ పట్టా పొందారు. దుర్గాపూర్ స్టీల్ ప్లాంట్‌లో చాలా కాలం పని చేసిన తరువాత, రష్యా, ఫ్రాన్స్‌లలో ట్రైనింగ్ పొంది, విశాఖపట్నం బి.హెచ్.పి.వి.లో 2001 వరకు పనిచేసి జనరల్ మేనేజరుగా రిటైర్ అయ్యారు. బి.టెక్ లో ఉండగా ఆంధ్రాయూనివర్శిటీ వారి పద్యరచన పోటీలలో మూడు సంవత్సరాలు వరుసగా " ప్రధమ స్థానం" పొందారు. మేడసాని మోహన్, నాగఫణిశర్మ, గరికపాటి నరసింహారావు మొదలైన ప్రఖ్యాత అవధానుల అష్ట, శత, సహస్రావధానాలలో పృచ్ఛకుడుగా వ్యవహరించి " బెస్ట్ పృచ్ఛకుడు " అవార్డులు పొందారు. రాజుగారి దుష్కరప్రాస సమస్యల గురించి ఈ ప్రఖ్యాతావధానులందరు మెచ్చుకుంటారు.



# Advertise in America Bharathi !

**Dear Prospective Sponsor,**

**America Bharathi, the magazine of American Telugu Association (ATA) is a medium with a very large readership. It is the first Telugu magazine in America and several thousands of members and non-members in USA and outside read America Bharathi every quarter. Since we are also making the entire issue of America Bharathi available on our ATA website (www.ataworld.org), the readership is many times the previous number, making it a prominent platform. We hereby request you to consider sponsorship for America Bharathi. We are currently looking for sponsors for the forthcoming quarterly (October-December) issue of America Bharathi and in return for your sponsorship, we will place your advertisement in that issue.**
**The suggested advertisement rates are as follows:**

| | |
|---|---|
| **Inside Cover (color):** | **$500** |
| **Back Cover (3/4 page & color)** | **$500** |
| **Inside Full Page** | **$250** |
| **Inside ½ Page:** | **$150** |
| **Inside ¼ Page:** | **$75** |
| **Sponsorship (color):** | **$2500** |

**For more information or if you have questions, please contact: Mr. Buchi Reddy, Chairperson – America Bharathi Trust, at:**

**By phone: 949-510-8590**
**By E-mail: HANAMKONDA@AOL.COM**

**Please mail your sponsorship check made payable to "American Telugu Association", to the following address along with your choice of advertisement, family picture, or business card to be published in the forthcoming issue of America Bharathi.**

**Address to send your payments & Pictures/Ads:**

**Siva Prasad Kumpatla**
**P.O. Box 68754**
**Indianapolis, IN 46268**

**Thank you in advance for your support to American Telugu Association and America Bharathi magazine.**

- America Bharathi Trust Fund